అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం




మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పక్కన మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓడినంత మాత్రాన పార్టీ శ్రేణులు కుంగిపోవాల్సిన అవసరం లేదని, పార్టీకి 40 శాతం ఓట్లు పోలయ్యాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయం ఆవరణలో గురువారం ఎమ్మిగనూరు, నందవరం మండలాల వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బుట్టా రేణుక మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు, నాయకులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. ప్రత్యర్థి కూటమిలోని మూడు పార్టీల నాయకులు తప్పుడు ప్రచారం, మోసపూరిత హామీలతో అధికారం చేజిక్కించుకున్నారని విమర్శించారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. పార్టీ బలోపేతానికి పాటు పడాలని సూచించారు.

ఏ సమస్య అయినా ధైర్యంగా ఎదుర్కొందాం:
వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయినంత మాత్రాన అధైర్యపడవద్దని ఏ సమస్య అయినా ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పార్టీ శ్రేణులకు ధైర్యాన్నిచ్చారు. అబద్ధపు ప్రచారంతోనే చంద్రబాబు గద్దెనెక్కారన్నారు. గ్రామాల్లో ఎవరూ టీడీపీకి భయపడాల్సిన అవసరం లేదని ధైర్యంగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఎవరూ రాజీనామాలు చేయవద్దని ఏదైనా సమస్య వస్తే కోర్టును ఆశ్రయిద్దామన్నారు. పార్టీ శ్రేణులు ఐక్యతతో ప్రజల పక్షాన మెలుగుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసేలా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, ఇందుకు ప్రజలతో కలిసి పోరాటం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్, బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, శివప్పగౌడ్, విరుపాక్షిరెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, ఆయా మండలాల్లోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని సెంట్రల్: విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాలలో గురువారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని దానాల్లో విద్యాదానం గొప్పదన్నారు. కొంత మంది ధనార్జనే ధ్యేయంగా విద్యను వ్యాపారంగా మార్చారన్నారు. నీతి నిజాయతీతో పనిచేసి నలుగురికి విద్యాబుద్ధులను అందించినప్పుడు సమాజమే గుర్తింపునిస్తుందని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలను నడపడం అంత ఆషామాషీ కాదని, ఎవరికైనా ఇబ్బందులు ఉంటే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయ నాయకులు, అధికారులు ఒత్తిడి తెస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, మండల విద్యాధికారులు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు ప్రైవేట్ పాఠశాలల సంఘం నాయకులు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై గోదాము మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని అర్బన్: సివిల్ సప్లై గోదాము మేనేజర్ రవీంద్రనాథ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి జిల్లాధికారికి ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని సివిల్ సప్లై గోదామును ఎమ్మెల్యే తనిఖీ చేశారు. బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై జిల్లాధికారితో ఫోన్‌లో సంభాషించారు. గోదాముకు ఎవరు వస్తారో ఎవరు పోతారో, బియ్యం ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు బయటికి వెళ్తాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మేనేజర్ ఇక్కడ ఉండడం లేదని, పట్టణంలో చాలామంది డీలర్లు బస్తాల్లో బియ్యం తక్కువగా వస్తున్నాయని ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే మేనేజర్ రవీంద్రనాథ్‌ను సస్పెండ్ చేయాలని ఫిర్యాదు చేశారు. అనంతరం అక్కడి హమాలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోదాములో తాగునీటి సమస్య ఉందని చెప్పగా పరిష్కరించాలని తహసీల్దార్ హసీనాసుల్తానాను ఆదేశించారు. డీటీ వలీబాషా తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎస్‌బీ ఎస్‌ఐకు సేవా పురస్కారం



జిల్లా ఎస్పీ చేతుల మీదుగా సేవా పురస్కారం అందుకుంటున్న ఎస్‌బీ ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు

మంత్రాలయం: 2024 ఎన్నికల్లో నిఘా విభాగంలో మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాల నుంచి క్రియాశీలకంగా పనిచేసిన ఎస్‌బీ ఎస్‌ఐ వేణుగోపాల్ రాజ్ సేవలకు ఉత్తమ పురస్కారం లభించింది. గురువారం కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా ఆయన ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. అడిషనల్ ఎస్పీ నాగరాజు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ మహేష్‌కుమార్, కోసిగి సీఐ ప్రసాద్ ఉన్నారు.

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



ఖాదర్‌లింగ స్వామి సమాధి

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు. భక్తులకు ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



18వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 18వ వార్డులో చేపట్టిన పారిశుద్ధ్య పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. వార్డు పరిధిలో డ్రైనేజీలను పరిశీలించి పేరుకుపోయిన చెత్తచెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బందితో తొలగింపజేశారు. పారిశుద్ధ్య పనుల్లో జాప్యం వహించవద్దని సిబ్బందిని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాప్‌ల భారాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప కోరారు. గురువారం ఎస్టీయూ భవనంలో ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్‌బాబు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. యాప్‌ల నిర్వహణపై ఉపాధ్యాయులకు ఒత్తిడి పెరగడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతుందన్నారు. ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఎస్టీయూ నాయకులు బి.రామాంజనేయులు, గోపాల్, రామకృష్ణ, సూర్యుడు, అంజినయ్య, వి.రామాంజినేయులు పాల్గొన్నారు.

నందవరం: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, యాప్‌ల భారాన్ని తగ్గించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ, జిల్లా కార్యదర్శి కాకె వెంకటేశప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నందవరంతో పాటు నాగలదిన్నె, చిన్నకొత్తిలి, గంగవరం, ఇబ్రహీంపురం, ముగతి గ్రామాల్లో డీటీఎఫ్ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. డీటీఎఫ్ నాయకులు వెంకటాచలం, మాదవగౌడ్, రాజేంద్ర జయన్న, మల్లికార్జున పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదోని రూరల్: జూన్ 7వ తేదీన చేపట్టే ఛలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా నాయకులు సంగిపాగు నాగప్ప మాదిగ, ఎం.జగన్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక కోడల్‌పేట కాలనీలో వారు సమావేశమై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. మాదిగల ఆత్మగౌరవ సభ 'హలో మాదిగ - ఛలో వరంగల్' కార్యక్రమంలో పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. నాయకులు రామాంజనేయులు, చిన్నరంగస్వామి, శంకర్, సామేల్, హేమంత్‌కుమార్, అఖిల్, విజయ్, సుధాకర్, వినయ్, మల్లికార్జున పాల్గొన్నారు.

అందుబాటులో డిగ్రీ కోర్సులు

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.శివారెడ్డి సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆదోని ప్రజల దశాబ్దాల కలను నెరవేరుస్తూ 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీ కళాశాలను మంజూరు చేసిందన్నారు. కళాశాలలో బీఏ ఎకనామిక్స్, బీకాం జనరల్, బీఎస్సీ బాటనీ వంటి సింగిల్ మేజర్ సబ్జెక్టులతో కూడిన కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది అదనంగా బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సులు మంజూరైనట్లు చెప్పారు. విద్యార్థులు గమనించి ఆయా విభాగాల్లో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశాలపై సందేహాలను నివృత్తి చేసేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొందరపడి ప్రైవేటు కళాశాలల్లో చేరి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. అధ్యాపకుడు డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30న ఉచిత కంటి ఆపరేషన్లు



కరపత్రాలను విడుదల చేస్తున్న వామ్ సభ్యులు

ఆదోని అర్బన్: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) ఆధ్వర్యంలో శాంతిరామ్ ఆస్పత్రి, ఆరోగ్యశ్రీ సౌజన్యంతో ఈ నెల 30వ తేదీన పట్టణంలోని అరుణ్‌జ్యోతినగర్‌లోని హరళయ్య స్వామి ఆలయం వద్ద ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు ఎస్ఆర్ఐ, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కాకుబాళ్ నగేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కాకుబాళ్ నగేష్, ఆదోని పట్టణ వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా మాట్లాడుతూ అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు చెప్పారు. కంటికి సంబంధించిన పరీక్షలు చేసి డాక్టర్ల సిఫారసు మేరకు ఆరోగ్యశ్రీ సహకారంతో ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. అపరేషన్ అవసరమైన వారికి నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రికి ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వామ్ సభ్యులు నాయకంటి రఘు, వంకదారు మమతశ్రీ, ఎస్.శ్రీదేవి, డి.అనూష తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి ముప్పును నివారించండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని టౌన్: ఆదోనిలో తాగునీటి సమస్య పొంచి ఉందని, పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కోరారు. గురువారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో 7 టీఎంసీల నీరు ఉందని, ఆదోనికి నీటిని విడుదల చేసేలా కెనాల్ బోర్డు ఎస్ఈ, జిల్లా కలెక్టర్ కృషి చేయాలని కోరారు. బళ్లారిలో నీటి సమస్య తలెత్తడంతో టీబీ డ్యాం నుంచి సరఫరా చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో 20 రోజులకు సరిపడే నీరు మాత్రమే ఉందని, నీటి ఎద్దడి ఏర్పడకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదోని అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులకు రూ.30 కోట్ల మేర నిధులు అవసరమువతాయని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయించాలని కోరారు. రాజకీయాలు పక్కన పెట్టి ఆదోనికి పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు బోర్డు ఎస్ఈ, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, భాస్కర్, షఫీ, మునిస్వామి తదితరులు ఉన్నారు.

సాయన్న వెంటే నడుస్తాం

మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వెంటే తమ ప్రయాణమని పలువురు కౌన్సిలర్లు స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ఓడినా, గెలిచినా సాయన్న వెంటే ఉంటామని కౌన్సిలర్లు బాలాజీ యాదవ్, రామలింగేశ్వరయాదవ్, వైస్ చైర్మన్లు ఎంఎం గౌస్, నరసింహులు, కిషోర్, రాజేశ్వరరెడ్డి, తాయన్న, నాగరాజ్, సురేష్, ఆనంద్, అశోక్, వసీం అన్నారు. ఈ మేరకు గురువారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఇంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమేనని తమకు సీట్లు ఇచ్చి గెలిపించిన మాజీ ఎమ్మెల్యే వెంటే నడుస్తామన్నారు. ఆదోనిలో 42 మంది కౌన్సిలర్లలో ఒకరిద్దరు పార్టీ ఫిరాయించిన మాత్రాన ఒరిగేదేమి లేదని, మిగతా వారంతా వైఎస్సార్‌సీపీవైపే ఉన్నారని కౌన్సిలర్లు కిషోర్, బాలాజీ, హనుమంతు, ఆనంద్, ఫయాజ్, రామలింగేశ్వరయాదవ్, రాజేశ్వరరెడ్డి చెప్పారు.

నిబంధనల మేరకు సర్దుబాటు చేయాలి

ఆదోని సెంట్రల్: సర్దుబాటు పేరుతో ప్రాథమిక విద్యకు భంగం కలిగించకుండా, ప్రభుత్వ నిబంధనల మేరకు మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య నాయకులు అనిల్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం మండిగిరి పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఎంటీఎఫ్ పట్టణ ఉపాధ్యక్షులు బి.బసవరాజు అధ్యక్షతన భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. పురపాలక ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను నివారించడానికి ప్రాథమిక పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను గుర్తించడం పట్ల ప్రధానోపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడానికి అధికారులు ప్రతిపాదనలు పంపకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంచాయతీరాజ్ విద్యా వ్యవస్థ మాదిరిగానే పురపాలక విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. ఎంటీఎఫ్ నాయకులు జె.బసవరాజు, కోటన్న, దస్తగిరి, మద్దయ్య, సురేష్ కుమార్, భాస్కరాచారి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్యాబోధన



నాగలదిన్నెలో ఆర్డీటీ సంస్థ నిర్మించిన అంగన్‌వాడీ భవన పత్రాలను అందజేస్తున్న దృశ్యం

నందవరం: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్య బోధిస్తారని, 3 నుంచి 5 యేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని సూపర్‌వైజర్ సుచరిత సూచించారు. నాగలదిన్నెలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం పత్రాలను ఆ సంస్థ ఏరియా టీమ్ లీడర్ నాగసుదర్శన్ రెడ్డి, సీఓ ప్రతాప్, గ్రామ సర్పంచ్ లక్ష్మీ చేతుల మీదుగా గురువారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుచరిత, కార్యకర్తకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందిస్తారన్నారు. అలాగే చిన్నారులకు ఆటపాటలతో విద్యను బోధిస్తారని వివరించారు. ఆర్డీటీ సంస్థ రూ.16 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించిందన్నారు. దీంతో చిన్నారులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు అవకాశం కలిగిందన్నారు. అనంతరం గ్రామస్తులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్డీటీ సంస్థ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం మంజూరు చేయాలి



డీటీ సత్యన్నకు వినతిపత్రం ఇస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: 2018-19 సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. నాటి అధికారుల లెక్కల ప్రకారం రైతులకు రూ.550.46 కోట్ల పంట నష్ట పరిహారం విడుదల కావాల్సి ఉందన్నారు. వెంటనే నష్ట పరిహారం మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి బాలరాజు, నాయకులు బాబు, పెద్దారెడ్డి, శివరామరాజు, రాజేష్, ఈరన్న, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

● ఖాకీల మానవత్వం



అపస్మారక స్థితిలో పడిఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించిన దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని వీరశైవ కళ్యాణ మండపం సమీపంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో ఆదోని వన్‌టౌన్ పోలీసులు స్పందించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ వ్యక్తికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. సదరు వ్యక్తి గురించి తెలిసిన వారు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో లేదా ఆదోని వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ

కౌతాళం: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జూలై నెల నుంచి సచివాలయ సిబ్బందితో చేపట్టనున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 8719 మంది పింఛనుదారులకు గాను రూ.5.96 కోట్లు మంజూరయ్యాయని జులై 1వ తేదీన సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి పింఛను సొమ్ము అందిస్తారని వెల్లడించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు

నందవరం: గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలేఖ పేర్కొన్నారు. మండల పరిధిలోని పూలచింత గ్రామంలో గురువారం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. మురుగుకాలువలు, నీటి కుంటలు వంటివి శుభ్రంగా ఉంచేలా అధికారులను ఆదేశించామన్నారు. వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. గ్రామంలో 43 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎమ్మిగనూరుటౌన్: గుడికల్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో ప్రత్యామ్నాయ ఫీడర్ పనులు జరుగుతున్నందున శుక్రవారం ఆ ఫీడర్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ రాఘవేంద్ర గురువారం తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

నేడు మున్సిపల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు గురువారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆదోనిలో రేపు మున్సిపల్ మీట్

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 29వ తేదీన శనివారం జరగనున్నదని చైర్‌పర్సన్ బోయ శాంత గురువారం విలేకరులకు తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు తప్పకుండా హాజరుకావాలని అభివృద్ధిపై సమీక్ష ఉంటుందన్నారు. కౌన్సిల్ తీర్మానం మేరకు ఆమోదం తెలిపి ఆదోని అభివృద్ధికి పాటుపడాలని ఆమె కోరారు.

ఆర్థికసాయం అందజేత

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన టైలర్ వలి పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి మండల టైలర్ల సంఘం సభ్యులు గురువారం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు రఘు, టైలర్లు హరి, అస్లాం, చంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి



ఆదోనిలో సబ్ కలెక్టర్ శివనారాయణశర్మకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని పేద రైతులకు పంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య డిమాండ్ చేశారు. ఆదోనిలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్లుకుంట గ్రామంలోని ప్రభుత్వ భూమిని పేద రైతులకు ఇవ్వాలని రెండేళ్లుగా సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నా అధికారులలో చలనం లేదన్నారు. గ్రామానికి చెందిన లక్ష్మన్న తన కుమారుల పేరిట బోగస్ సర్టిఫికెట్లు పుట్టించి భూమిని స్వాధీనం చేసుకున్నారన్నారు. సంబంధిత అధికారులు బోగస్ సర్టిఫికెట్లను రద్దుచేసి భూమిని పేద రైతులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మకు అందజేశారు. సీపీఐ నాయకులు వీరేష్, మబ్బు ఆంజనేయ, రాజు, తిక్కన్న, జాఫర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

ఆదోని రూరల్: అధిక పెట్టుబడులతో వ్యవసాయం భారమై దిక్కుతోచని స్థితిలో ఉన్న కౌలు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు వినతి పత్రం అందజేశారు. కౌలు రైతు సంఘం సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్‌యాదవ్, ఆదోని రైతు సంఘం మండల కార్యదర్శి యల్లప్ప, సీపీఐ ఆదోని పట్టణ కార్యదర్శి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వేలం పాటలు



వేలంపాట నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

కౌతాళం: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో వివిధ పన్నుల వసూలుకు సంబంధించి వేలం పాటను గురువారం సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన డీఎల్‌పీఓ నూర్జహాన్ నిర్వహించారు. కమేలా వేలం పాటను ఏరిగేరి నబామ్మ రూ.33 వేలకు సొంతం చేసుకోగా బండిమెట్ట, దినసరి మార్కెట్ వేలం పాటలు వాయిదా పడ్డాయి. అలాగే మండల పరిధిలోని హాల్వి గ్రామంలో వేలం పాటలు నిర్వహించారు. బండిమెట్ట రూ.4.71 లక్షలకు కురవ నాగేష్ దక్కించుకోగా, వారపు సంత రూ.15 వేలకు మారెన్న సొంతం చేసుకున్నారు. వేలం దక్కించుకున్న వారికి జులై 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 30వ తేదీ వరకు 9 నెలల పాటు నిర్వహణ హక్కులు లభిస్తాయని డీఎల్‌పీఓ తెలిపారు. ఈఓపీఆర్డీ జనార్దన్, ఆయా గ్రామాల కార్యదర్శులు, శివప్ప, కరీం, గ్రామ సర్పంచ్ క్రాంతి పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



ఆలూరు నర్సరీలో పెంచుతున్న నేరేడు చెట్లను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఆలూరు రూరల్/దేవనకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా హార్టికల్చర్ కింద పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. ఆయన గురువారం ఆలూరు ఉపాధి హామీ క్లస్టర్ పరిధిలోని ఏపీఓలు, టీఏలు, ఈసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద 16 రకాల మొక్కలను వంద శాతం ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. పండ్ల తోటల అభివృద్ధితో పాటు పచ్చదనం పెంపునకు ఉపాధిహామీ యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఈ ఏడాది ఆలూరు క్లస్టర్ పరిధిలోని 5 మండలాల్లో 1,720 ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపట్టేలా లక్ష్యం నిర్దేశించామన్నారు. ఇప్పటివరకు 1,230 ఎకరాల్లో సాగు లక్ష్యం పూర్తి చేసినట్లు చెప్పారు. ఉపాధి హామీ జాబ్ కార్డుతో పాటు ఐదెకరాల్లోపు పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులను అర్హులుగా పేర్కొన్నారు. గులాబీ, మల్లెతో సహా మామిడి, బత్తాయి, నేరేడు, జామ, సీతాఫలం, మునగ, సపోట, కొబ్బరి, దానిమ్మ, చింత వంటి తోటలు అభివృద్ధి చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆలూరు నర్సరీలో అందుబాటులో ఉన్న 3 వేల మునగ మొక్కలను ప్రతి గ్రామంలో ఇంటి ఆవరణలో నాటుకునేందుకు ప్రజలకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. హార్టికల్చర్ జిల్లా మేనేజర్ నందకిషోర్, ఆలూరు ఏపీడీ పద్మావతి, సీఎల్ఆర్‌సీ కోర్స్ డైరెక్టర్ సురేష్‌బాబు, ఏపీఓలు, టీఏలు, ఈసీలు ఉన్నారు.

- రైతులు పండ్ల తోటల సాగులో రాణించాలని డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం దేవనకొండలోని స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు క్లస్టర్ లెవెల్ సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. పండ్లతోటల సాగు చేపట్టిన రైతులకు అందిస్తున్న రాయితీలను వివరించారు. ఏపీడీ పక్కీరప్ప, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.